సాక్షి నల్లగొండ

గురువారం ౹ 8 ౹ జూన్ ౹ 2023



'సహకార'ం అవినీతిమయం

సూర్యాపేట జిల్లా రాయినిగూడెం పీఏసీఎస్ అవినీతిలో కూరుకుపోయిందని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. - 8లో



ఈదురుగాలుల బీభత్సం

దేవరకొండ, గుర్రంపోడు మండలాల్లో బుధవారం సాయంత్రం ఈదురుగాలులు బీభత్సం సృష్టించాయి. - 10లో

గరిష్టం/కనిష్టం 42° / 29°

వాతావరణం

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. అక్కడక్కడ ఉరుములతో కూడిన వర్షం కురిసే అవకాశం ఉంది.

చెరువుల సంబురం

నేడు జిల్లా వ్యాప్తంగా 560 చెరువుల వద్ద కార్యక్రమం

- ముగ్గులు, తోరణాలతో అలంకరణ
- బతుకమ్మలు, బోనాలతో తరలిరానున్న మహిళలు
- చెరువుల కింద పెరిగిన సాగు, మత్స్య సంపదను తెలిపేలా ఫ్లెక్సీల ఏర్పాటు



మునుగోడు చెరువు వద్ద ఏర్పాట్లను పరిశీలిస్తున్న డీఆర్‌డీఓ కాళిందిని

నల్లగొండ టూటౌన్ : తెలంగాణ అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా ఈ నెల 8వ తేదీన ఊరూరా చెరువు పండుగ నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. జిల్లా వ్యాప్తంగా ఉన్న 560 చెరువుల వద్ద 8న సాయంత్రం 5 గంటలకు ఆయా గ్రామాల ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని పండుగ జరుపుకునేలా అధికార యంత్రాంగం ఏర్పాట్లు చేస్తోంది. ఊరూరా చెరువు పండుగపై ఇప్పటికే కలెక్టర్ మత్స్య సహకార పారిశ్రామిక సహకార సంఘాల బాధ్యుల, నీటిపారుదల శాఖ అధికారులు, గ్రామ పంచాయతీ కార్యదర్శులతో టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించి పలు సూచనలు చేశారు. చెరువుతో ప్రత్యక్షంగా, పరోక్షంగా ప్రయోజనాలు పొందుతున్న గ్రామ ప్రజలందరినీ చెరువు వద్ద జరిగే పండుగ కార్యక్రమంలో భాగస్వాములు చేయనున్నారు. ఆయా గ్రామాల్లోని గ్రామ పంచాయతీ కార్యాలయాల నుంచి ప్రజలందరూ ఒకేసారి చెరువు వద్దకు వెళ్లేల్లా అధికార యంత్రాంగం చొరవ తీసుకుంటోంది. మత్స్య, నీటిపారుదల, పంచాయతీరాజ్ శాఖల ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం పెద్ద ఎత్తున్న నిర్వహించనున్నారు.

అట్టహాసంగా కార్యక్రమాలు..

జిల్లాలోని 844 గ్రామ పంచాయతీల్లోని 560 చెరువుల వద్ద అట్టహాసంగా నిర్వహించ తలపెట్టిన ఊరూరా చెరువు పండుగ సందర్భంగా చెరువు కట్టల వద్ద ఉండే గ్రామ దేవతలకు బోనాలు సమర్పించనున్నారు. మహిళలు బోనాలు ఎత్తుకొని వస్తుంటే డప్పు చప్పుళ్లతో, యువత ఆటా పాటలు, కేరింతలతో ఈ కార్యక్రమం నిర్వహించనుంది. అదే విధంగా బతుకమ్మలను పేర్చుకొచ్చి చెరువు వద్ద మహిళలతో ఆటా, పాటా ఆడించి చెరువులో నిమజ్జనం చేయించనున్నారు. చెరువు నీటికి పూజలు చేశాక సభ, సంస్కృతిక కార్యక్రమాలు, కోలాటాలు, గోరెటి వెంకన్న రాసిన చెరువోయ్ మా ఊరి చెరువు పాటలు పాడతారు. ఈ కార్యక్రమానికి హాజరయ్యే వారందరికీ మాంసాహారంతో కూడిన భోజనాలు ఏర్పాటు చేయనున్నారు. కేసీఆర్ ప్రభుత్వం మత్స్యకారులకు పంపిణీ చేసిన వాహనాలను (వ్యాన్‌లు) అలంకరించి చెరువు వద్దకు తీసుకురానున్నారు. మత్స్యకారులకు అందించిన వలలను కూడా తీసుకొచ్చి అక్కడ ఉంచనున్నారు. ఇక, చెరువు వద్ద పండుగ వాతావరణంలో ప్రతిబింబించేలా ముగ్గులు, తోరణాలు అంలకరించారు. సాగులో వచ్చిన ప్రగతి, పెరిగిన పంటలు, మత్స్యసంపద, తదితర వాటిని తెలిపే విధంగా ఫ్లెక్సీలను ఏర్పాటు చేస్తున్నారు.

560 చెరువుల వద్ద పండుగ

తెలంగాణ అవతరణ దశాబ్ది ఉత్సవాల సందర్భంగా గురువారం జిల్లాలోని 560 చెరువుల వద్ద పండుగ నిర్వహించడానికి ఏర్పాట్లు చేశాం. బోనాలు, బతుకమ్మలతో మహిళలు చెరువు వద్ద పండుగ వాతావరణంతో వేడుకలు జరుపుకుంటారు.

– వెంకయ్య, మత్స్యశాఖ జిల్లా అధికారి

చెరువుల పండుగను విజయవంతం చేయాలి



ప్రతి చెరువు ఒక దేవాలయం లాంటిది. చెరువును కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిది. తెలంగాణ ప్రభుత్వం మిషన్ కాకతీయ ద్వారా చెరువుల్లో పూడిక తీయడం వల్ల ఎండాకాలంలో కూడా చెరువులు నీటితో కళకళలాడుతున్నాయి. చెరువుల ద్వారా గ్రామానికి ఎంతో మేలు జరుగుతుంది. సాగు, తాగునీటి సమస్య పరిష్కరం కావడంతోపాటు మత్స్యకారులు కూడా లాభపడుతున్నారు.

–అజయ్‌కుమార్, ఎస్ఈ, నీటిపారుదల శాఖ

నేటి నుంచి ఫిష్ ఫుడ్ ఫెస్టివల్

తెలంగాణ అవతరణ దశాబ్ది ఉత్సవాల సందర్భంగా ఈనెల 8 నుంచి 10వ తేదీ వరకు జిల్లా మత్స్యశాఖ ఆధ్వర్యంలో ఫిష్ ఫుడ్ ఫెస్టివల్ నిర్వహించనున్నారు. నల్లగొండలోని ఎన్జీ కాలేజీ మైదానంలో గురువారం ఉదయం 11 గంటలకు జిల్లా మంత్రి గుంటకండ్ల జగదీశ్ రెడ్డి, ఇతర ప్రజా ప్రతినిధులు ఈ కార్యక్రమాన్ని ప్రారంభించనున్నారు. మూడు రోజుల పాటు మధ్యాహ్నం నుంచి రాత్రి వరకు ఈ కార్యక్రమం కొనసాగనుంది. 20 స్టాళ్లను ఏర్పాటు చేసి చేపల ఆహార పదార్థాలను ప్రజలకు అందుబాటులో ఉంచుతారు. ఫిష్ ఫెస్టివల్‌లో 9వ తేదీన రాష్ట్ర పశుసంవర్ధక, మత్స్యశాఖ మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్, రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి పాల్గొననున్నారు. అదేరోజు మధ్యాహ్నం 12గంటలకు నకిరేకల్ స్టేడియంలో గొర్రెల పంపిణీ కార్యక్రమంలో వారు పాల్గొనున్నారు.



ఎన్జీ కాలేజీ వద్ద ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ

ఫుట్‌బాల్ పోటీల్లో జిల్లా జట్టు విజయం



కప్ అందుకుంటున్న క్రీడాకారులు

నల్లగొండ టూటౌన్ : మంచిర్యాలలో నాలుగు రోజులుగా జరిగిన రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్ పోటీల్లో ఉమ్మడి నల్లగొండ జిల్లా జట్టు విజయం సాధించింది. నిజామాబాద్ జిల్లా జట్టుతో జరిగిన ఫైనల్ పోటీల్లో 1–0 స్కోర్‌తో జిల్లాకు చెందిన బాలికల జట్టు గెలుపొందింది. క్రీడాకారులు అద్భుతమైన ఆట తీరు ప్రదర్శించడంతో పోటీల్లో గెలుపొందినట్లు ఫుట్‌బాల్ అసోసియేషన్ ఉమ్మడి జిల్లా ప్రధాన కార్యదర్శి బొమ్మపాల గిరిబాబు తెలిపారు. గెలుపొందిన జట్టు, కోచ్‌లు మద్ది కరుణాకర్, కందుకూరి శైలజకు గిరిబాబు అభినందనలు తెలియజేశారు.

మూడోసారి కూడా కేసీఆరే ముఖ్యమంత్రి

- సాగునీటి దినోత్సవంలో శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి



మాట్లాడుతున్న శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి

నార్కట్‌పల్లి : తెలంగాణ రాష్ట్రాన్ని అభివృద్ధిలో నంబర్‌వన్‌గా మార్చిన కేసీఆర్ మూడోసారి ముఖ్యమంత్రిగా హ్యాట్రిక్ సాధించబోతున్నారని శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి ధీమా వ్యక్తం చేశారు.బుధవారం సాగునీటి దినోత్సవం సందర్భంగా నార్కట్‌పల్లిలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. నకిరేకల్ నియోజకవర్గానికి కృష్ణా, గోదావరి, మూసీ నదుల జలాలను అందించి త్రివేణి సంగమంగా మార్చేందుకు సీఎం కేసీఆర్ కృషి చేస్తున్నారని చెప్పారు. ప్రతి ఎకరానికి సాగునీరు, ఉచితంగా కరెంటు అందిస్తున్న సీఎం కేసీఆర్ రైతుల పక్షపాతి అన్నారు. ప్రతి కుటుంబానికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందుతున్నాయని, ప్రతిపక్షాలు చెబుతున్న కల్లబొల్లి మాటలను ఎవరూ నమ్మవద్దన్నారు. నార్కట్‌పల్లి మండలానికి కాళేశ్వరం జలాలను తీసుకొచ్చేందుకు సీఎం కేసీఆర్ ఎంతో కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. జెడ్పీ చైర్మన్ బండా నరేందర్‌రెడ్డి, నకిరేకల్ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య మాట్లాడుతూ సీఎం కేసీఆర్ సారథ్యంలో బ్రహ్మణ వెల్లంల – ఉదయ సముద్రం ప్రాజెక్టును త్వరలోనే ప్రారంభించి రైతులకు సాగు, తాగునీరు అందిస్తామన్నారు. అయిటిపాముల లిఫ్ట్ ఇరిగేషన్‌కు రూ.100 కోట్లు మంజూరు చేశారని, ఆ ప్రాజెక్టును త్వరలోనే పూర్తి చేస్తామన్నారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రేగట్టె మల్లికార్జున్‌రెడ్డి, ఎంపీపీలు జ్యోతిబలరాం, సునీత, జెడ్పీటీసీలు తరాల బలరాం, ధనలక్ష్మి, మున్సిపల్ చైర్మన్లు శ్రీనివాస్‌గౌడ్, చిన వెంకట్‌రెడ్డి, చిట్యాల మార్కెట్ కమిటీ చైర్మన్ ఆదిమల్లయ్య ఉన్నారు.

పంటలకు మద్దతు ధర పెంపు

పెరిగిన ధరలు ఇలా.. (క్వింటాల్‌కు రూ.లలో)

పంట	పాత ధర	కొత్త ధర	పంట	పాత ధర	కొత్త ధర
మొక్కజొన్న	1,962	2,050	పత్తి	6,080	6,620
వరి (సాధారణం)	2,040	2,183	వేరుశనగ	5,850	6,377
పెసర	7,755	8,558	సోయాబీన్	4,300	4,600
కంది	6,600	7,000	నువ్వులు	7,830	8,635
మినుములు	6,600	6,950	సజ్జలు	2,350	2,500
			రాగులు	3,578	3,846



నల్లగొండ అగ్రికల్చర్ : రైతులను మరింత ప్రోత్సహించేందుకు కేంద్ర ప్రభుత్వం వానాకాలం పంటలకు మద్దతు ధరను పెంచింది. ఈ మేరకు బుధవారం ఉత్తర్వులు వెలువడ్డాయి. వరికి కనీస మద్దతు ధర 7శాతం, పెసర్లకు 10 శాతం, కందులకు 7శాతం, వేరుశనగకు 9శాతం ధరను పెంచింది. పెంచిన ధరలను ఈ వానాకాలం నుంచి అమలు చేయనున్నట్లు ప్రభుత్వం పేర్కొంది.

నేడు జిల్లాకు భట్టి విక్రమార్క పాదయాత్ర

- డిండి నక్కలగండి ప్రాజెక్టు వద్ద జిల్లాలోకి..
- ఉమ్మడి జిల్లాలో 15 రోజులపాటు సాగనున్న పాదయాత్ర
- బహిరంగ సభలు, కార్నర్ మీటింగ్‌లలో మాట్లాడనున్న భట్టి



నల్లగొండ : సీఎల్పీ నాయకుడు మల్లు భట్టి విక్రమార్క చేపట్టిన పీపుల్స్ మార్చ్ పాదయాత్ర గురువారం నల్లగొండ జిల్లాలోకి ప్రవేశిస్తోంది. వాస్తవంగా బుధవారమే రావాల్సి ఉన్నా.. ఒకరోజు ఆలస్యంగా జిల్లాలోకి వస్తోంది. గురువారం ఉదయం నాగర్‌కర్నూల్ జిల్లా నుంచి చందంపేట మండలం డిండి నక్కలగండి ప్రాజెక్టు వద్ద జిల్లాలోకి ప్రవేశిస్తుంది. అక్కడ డిండి భూ నిర్వాసితులతో భట్టి సమావేశమవుతారు. భట్టి పాదయాత్ర 8వ తేదీ నుంచి 22వ తేదీ వరకు నల్లగొండ, సూర్యాపేట జిల్లాల పరిధిలో 15 రోజులపాటు కొనసాగనుంది. 16వ రోజైన 23వ తేదీన కోదాడ నియోజకవర్గం నుంచి ఖమ్మం జిల్లా పాలేరు నియోజకవర్గంలోకి వెళ్లనుంది.

సభలో ప్రసంగించనున్న భట్టి

భట్టి విక్రమార్క పీపుల్స్‌మార్చ్ పాదయాత్ర నల్లగొండ జిల్లా పరిధిలో దేవరకొండ, నాగార్జున సాగర్, నల్లగొండ, సూర్యాపేట, కోదాడ నియోజకవర్గాల పరిధిలో సాగనుంది. పాదయాత్రలో భాగంగా నల్లగొండలో బహిరంగ సభ, దేవరకొండ, నకిరేకల్, సూర్యాపేట, నామారం వద్ద కార్నర్ మీటింగ్‌లు నిర్వహించనున్నారు. బీఆర్ఎస్ అధికారంలోకి వచ్చాక ప్రజలకు ఇచ్చిన హామీలు, వాటి అమలులో వైఫల్యాలను వివరించడంతోపాటు జిల్లాలో పెండింగ్ ప్రాజెక్టులపైనా పాదయాత్రలో భట్టి మాట్లాడనున్నారు. మరోవైపు ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు తెలుసుకుంటూ పాదయాత్ర కొనసాగించనున్నారు.

భూ నిర్వాసితులతో మాట్లాడుతారు

సీఎల్పీ నేత భట్టి విక్రమార్క పాదయాత్ర జిల్లాలోకి ప్రవేశిస్తున్నందున నక్కనగండి వద్ద ఏర్పాట్లు చేస్తున్నాం. అక్కడ భట్టి భూనిర్వాసితుల సమావేశమై వారి సమస్యలు తెలుసుకుంటారు. అ తర్వాత నిర్వహించే కార్యక్రమంలో భట్టి మాట్లాడతారు.

– బాలునాయక్, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి

ఎండ.. వడగాలులు

- మధ్యాహ్నం వేళ రోడ్లపైకి వచ్చేందుకు జంకుతున్న జనం
- 42 డిగ్రీలపైనే గరిష్ట ఉష్ణోగ్రతలు నమోదు

నల్లగొండ : ఎండ తీవ్రతతో జనం అల్లాడుతున్నారు. నాలుగు రోజులుగా ఉదయం 7గంటల నుంచే ఎండ తీవ్రత పెరుగుతోంది. దీంతో జనాలు ఇబ్బంది పడుతున్నారు. ఇళ్లనుంచి కూడా బయటికి వచ్చేందుకు సాహసించడం లేదు. దీంతో ఉదయం 10 గంటల నుంచే రోడ్లు నిర్మానుష్యంగా మారుతున్నాయి. జిల్లా అంతటా గరిష్ట ఉష్ణోగ్రతలు 42 డిగ్రీలపైనే నమోదవుతూ.. వడ గాలులు వీస్తుండడంతో జనాలు అల్లాడుతున్నారు. బుధవారం జిల్లాలో సగటున 42.5 డిగ్రీల గరిష్ట ఉష్ణోగ్రత నమోదైంది. ఎక్కువాగా దామరచర్ల 45.3, కేతేపల్లి 45.0, నిడమనూర్ 44.8, తిప్పర్తి 44.5, త్రిపురారం 43.9, నల్లగొండ 43.8, వేములపల్లి 43.5, కట్టంగూర్ 43.5 డిగ్రీల గరిష్ట ఉష్ణోగ్రత నమోదైంది.



సాయంత్రం వేళ నల్లగొండ క్లాక్ టవర్ వద్ద పాక్షికంగా ఉన్న జన సంచారం

సప్లిమెంటరీ పరీక్షలు సజావుగా నిర్వహించాలి

- అదనపు కలెక్టర్ భాస్కర్‌రావు



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ భాస్కర్‌రావు

నల్లగొండ : ఈనెల 12 నుంచి 17వ తేదీ వరకు జరుగనున్న ఇంటర్మీడియట్ సప్లిమెంటరీ పరీక్షలు సజావుగా నిర్వహించాలని అదనపు కలెక్టర్ భాస్కర్‌రావు అధికారులను ఆదేశించారు. ఇంటర్మీడియట్ సప్లిమెంటరీ పరీక్షలు నిర్వహణపై బుధవారం కలెక్టరేట్‌లో సంబంధిత అధికారులతో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరీక్షల కోసం జిల్లా వ్యాప్తంగా 36 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. మొత్తం 14,409 విద్యార్థులు పరీక్షలకు హాజరు కానున్నారని.. వీరిలో మొదటి సంవత్సరం 8,321 మంది, ద్వితీయ సంవత్సరం 4,362 మంది, ఒకేషనల్ మొదటి సంవత్సరం 1,025 మంది, ద్వితీయ సంవత్సరం 701 మంది ఉన్నారని వెల్లడించారు. సమావేశంలో జిల్లా ఇంటర్మీడియట్ అధికారి దస్రూనాయక్, ఎగ్జామినేషన్ కమిటీ సభ్యులు భానునాయక్, ఇస్మాయిల్ పాల్గొన్నారు.

గోదారమ్మతో సస్యశ్యామలం





చివ్వెంల : బీబీగూడెం వద్ద గోదావరి జలాల్లో పూలు చల్లుతున్న మంత్రి జగదీష్‌రెడ్డి, వండర్‌బుక్ ఆఫ్ రికార్డ్ ధ్రువీకరణ పత్రం అందజేస్తున్న సంస్థ ప్రతినిధులు

- కాళేశ్వరం ప్రాజెక్టుతోనే తుంగతుర్తి, సూర్యాపేట, కోదాడ ప్రాంతాలకు సాగునీరు
- విద్యుత్ శాఖ మంత్రి జగదీష్‌రెడ్డి
- బీబీగూడెం వద్ద గోదావరి జలాలకు లక్ష జనహారతి ప్రారంభం

చివ్వెంల(సూర్యాపేట): సీమాంధ్రుల పాలనలో బీళ్లుగా ఉన్న తుంగతుర్తి, సూర్యాపేట, కోదాడలోని కొద్ది ప్రాంతం భూములు స్వరాష్టం వచ్చి కేసీఆర్ ముఖ్యమంత్రి అయ్యాక మేడిగడ్డ వద్ద నిర్మించిన కాళేశ్వరం ప్రాజెక్టు నుంచి ఎస్సారెస్పీ కాల్వల ద్వారా గోదావరి జలాలు అందుతుండడంతో నేడు సస్యశ్యామలంగా మారాయని రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గుంటకండ్ల జగదీష్‌రెడ్డి అన్నారు. అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వేసిన శంకుస్థాపన రాళ్లు ఈ ప్రాంత రైతాంగాన్ని వెక్కిరించేలా ఉండగా.. నాటి ప్రతిపక్ష నాయకుడు నాటిన మొక్కలు కాస్త వట వృక్షాలుగా మారాయని ఆయన దుయ్యబట్టారు. రాష్ట్ర అవతరణ దశాబ్ది వేడుకల్లో భాగంగా బుధవారం చివ్వెంల మండలం బీబీగూడెం గ్రామ శివారులోని ఎస్సారెస్పీ 71 డీబీఎం వద్ద కాళేశ్వరం జలాలకు లక్ష జనహారతి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గోదావరి జలాలకు హారతి పట్టి పూలు చల్లి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం స్థానికంగా మీడియాతో మాట్లాడుతూ సీమాంధ్రుల పాలనలో జరుగుతున్న దోపిడీని కనిపెట్టిన ముఖ్యమంత్రి కేసీఆర్ నీళ్లు, నిధులు, నియామకాల పేరుతో ప్రత్యేక రాష్ట్ర ఉద్యమానికి శ్రీకారం చుట్టారన్నారు. ఆ సమయంలోనే సూర్యాపేట, తుంగతుర్తి నియోజకవర్గాల్లో పర్యటించినప్పుడు ఈ ప్రాంతానికి గోదావరి జలాలే శరణ్యమని భావించి మేడిగడ్డ వద్ద కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మించి మిడ్ మానేరుకు అటు నుంచి లోయర్ మానేరుకు అక్కడి నుంచి ఈ ప్రాంతానికి నీళ్లు పారించారని తెలిపారు. దీంతో యావత్ భారతదేశంలోనే వరి దిగుబడిలో సూర్యాపేట రికార్డు సృష్టించిందన్నారు. అందుకు ముఖ్యమంత్రి కేసీఆర్‌కు కృతజ్ఞతలు చెప్పుకునేందుకు దశాబ్ది ఉత్సవాల సందర్భంగా నీటిపారుదల దినోత్సవం రోజును ఈ ప్రాంత రైతాంగం కాళేశ్వరం జలాలకు లక్ష జనహారతి కార్యక్రమం నిర్వహిస్తామని ముందుకు రావడం శుభపరిణామమన్నారు. వాస్తవానికి లక్ష మందితో నిర్వహించాలి అనుకుంటే లక్షా 16 వేల 142 మంది హాజరయ్యారని వెల్లడించారు. కాళేశ్వరం జలాలతో మొదట లబ్ధి పొందిన తుంగతుర్తి, సూర్యాపేట, కోదాడ రైతాంగాం స్వచ్ఛందంగా భాగస్వామ్యం అయినందునే ఈ కార్యక్రమం విజయవంతమైందని సంతృప్తి వ్యక్తం చేశారు. కాగా, లక్ష జనహారతి కార్యక్రమం వండర్ బుక్ ఆఫ్ రికార్డులో చోటు దక్కించుకుంది. ఈ సందర్భంగా మంత్రికి ఆ సంస్థ ప్రతినిధులు ధ్రువీకరణ పత్రం అందజేశారు. కార్యక్రమంలో రాజ్యసభ సభ్యుడు బడుగుల లింగయ్య యాదవ్, కోదాడ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్య యాదవ్, కలెక్టర్ వెంకట్రావు, అదనపు కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్, ఎస్పీ రాజేంద్ర ప్రసాద్ పాల్గొన్నారు.



మత్స్యకారులతో మంత్రి జగదీష్‌రెడ్డి

కనుల పండువగా 'లక్ష జనహారతి'

*">¯ ₹F : గోదావరి జలాలకు లక్ష జనహారతి కనుల పండువగా జరిగింది. జిల్లాలోని నాగారం మండలం ఈటూరు నుంచి పెన్‌పహాడ్ మండలం చీదెళ్ల గ్రామ చెరువు వరకు 68 కిలోమీటర్ల మేర లక్ష మందికి పైగా జనం హారతులు పట్టారు. తెలంగాణ దశాబ్ది వేడుకలను పురస్కరించుకుని నీటి పారుదల శాఖ ఆధ్వర్యంలో చేపట్టిన సాగునీటి దినోత్సవంలో భాగంగా బుధవారం చివ్వెంల మండలం బీబీగూడెం వద్ద ఎస్సారెస్పీ 71 డీబీఎంలో గోదావరి జలాలకు రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గుంటకండ్ల జగదీష్‌రెడ్డి ప్రత్యేక పూజలు చేశారు. చీర, సారె, పసుపు కుంకుమలతో హారతి పట్టారు. అక్కడి నుంచి కొంతదూరం కాలినడకన.. మరికొంత దూరం వాహనంలో కాలువ పొడవునా హారతులు పట్టేందుకు వచ్చిన జనానికి అభివాదం చేశారు. అక్కడక్కడా పలువురిని పలకరిస్తూ ముందుకు సాగారు.

126 గ్రామాల నుంచి..!

సాగునీటి దినోత్సవానికి జిల్లాలోని మూడు నియోజకవర్గాల్లోని ఏడు మండలాల నుంచి జనం తండోపతండాలుగా తరలివచ్చారు. 71 డీబీఎం పరిధిలోని 126 గ్రామాల ప్రజలు, రైతులు తమకు సమీపంలోని ఎస్సారెస్పీ కాలువ వద్దకు చేరుకుని ప్రత్యేక పూజలు చేశారు. పలుచోట్ల జనంతో కాలువ గట్లు కిక్కిరిసిపోయాయి. ప్రత్యేక పూజలు అనంతరం ఎక్కడికక్కడ వంటావార్పుతో సామూహిక భోజనాలు చేశారు. ఇకపోతే కాలువ పొడవునా ఆయా గ్రామాల ప్రజాప్రతినిధులు గ్రామస్తులతో కలిసి ఈ సాగునీటి దినోత్సవం పాల్గొన్నారు.

న్యూస్‌రీల్

సివిల్స్ శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

నల్లగొండ : ఎస్సీ స్టడీ సర్కిల్‌లో సివిల్స్ శిక్షణ కోసం 2023–24 సంవత్సరానికి దరఖాస్తులు ఆహ్వానిస్తూ ఎస్సీ స్టడీ సర్కిల్ డైరెక్టర్ శ్రీధర్ నోటిఫికేషన్ విడుదల చేసినట్లు ఎస్సీ కులాల అభివృద్ధి శాఖ జిల్లా అధికారిణి సల్మాబాను బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు జూలై 2వ తేదీలోపు సంబంధిత వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని, ప్రవేశపరీక్ష జూలై 9న ఉంటుంది వెల్లడించారు. ఎంపికైన అభ్యర్థులకు ఉచిత భోజనం, వసతితో పదినెలలపాటు హైదరాబాద్‌లో శిక్షణ ఉంటుందని పేర్కొన్నారు.

అధ్యాపక పోస్టులకు..

రామగిరి(నల్లగొండ) : తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల్లో ఖాళీగా ఉన్న వివిధ సబ్జెక్టుల్లో 2023–24 విద్యా సంవత్సరానికి తాత్కాలిక ప్రాతిపదికన అధ్యాపకులను భర్తీ చేయనున్నట్లు ఆర్‌సీఓ అరుణకుమారి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. జూనియర్ లెక్చరర్ తెలుగు 2, ఇంగ్లిష్ 2, మ్యాథ్స్ 2, బోటనీ 1, ఫిజిక్స్ 1, కెమిస్ట్రీ 1, పీజీటీ ఇంగ్లిష్ 2, మ్యాథ్స్ 2, సోషల్ 5, టీజీటీ ఫిజికల్ సైన్స్ 2, సోషల్ 3, పీఈటీ 1, లైబ్రేరియన్ 1, ఆర్ట్ అండ్ మ్యూజిక్ 1, డిగ్రీ లెక్చరర్ ఇంగ్లిష్ 1 పోస్టులు ఖాళీగా ఉన్నాయని తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు జూన్ 10వ తేదీలోపు ఎస్ఎల్‌బీసీ జీవీగూడెం సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

ఎరువులు, విత్తనాలు అందుబాటులో ఉంచాలి



సమావేశంలో మాట్లాడుతున్న రంగారెడ్డి

నల్లగొండ టౌన్ : వానాకాలం సీజన్ ఆరంభమైనందున జిల్లాలో అవసరమైన విత్తనాలు, ఎరువులను సిద్ధంగా ఉంచాలని, అదేవిధంగా అటవీ భూములు సాగు చేస్తున్న గిరిజనులకు పట్టాలను ఇవ్వాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు, మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం దొడ్డి కొమురయ్య భవన్‌లో జరిగిన ఆ పార్టీ జిల్లా కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. యాసంగిలో కొనుగోలు చేసిన ధాన్యానికి నెలలు గడుస్తున్నా డబ్బులు చెల్లించలేదని.. వెంటనే రైతుల ఖాతాల్లో డబ్బులు జమ చేయాలని కోరారు. రుణమాఫీ చేయడంలో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని.. బ్యాంకుల్లో వడ్డీలు పెరిగిపోయి రైతులు తీవ్రంగా నష్టపోయే ప్రమాదం ఏర్పడిందన్నారు. సమావేశంలో సీపీఎం జిల్లా కార్యదర్శి ముదిరెడ్డి సుధాకర్‌రెడ్డి, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు డబ్బీకార్ మల్లేషం, బండా శ్రీశైలం, పాలడుగు ప్రభావతి, చినపాక లక్ష్మీనారాయణ, సయ్యద్‌హాషం తదితరులు పాల్గొన్నారు.

యాదాద్రిలో సంప్రదాయ పూజలు



నిత్యకల్యాణం నిర్వహిస్తున్న ఆచార్యులు

యాదగిరిగుట్ట : యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహ స్వామి క్షేత్రంలో బుధవారం సంప్రదాయ పూజలు శాస్త్రోక్తంగా చేపట్టారు. వేకువ జామున ఆలయాన్ని తెరిచిన ఆచార్యులు సుప్రభాతం, స్వయంభూలకు బిందే తీర్థం, ఆరాధన గావించారు.అలాగే బాలభోగం చేపట్టి మూలవర్యులకు నిజాభిషేకం చేసి అలంకరించారు. అనంతరం శ్రీస్వామివారికి సహస్రనామార్చన, అమ్మవారికి కుంకుమార్చన, సుదర్శన నారసింహ హోమం, బ్రహ్మోత్సవం, నిత్యకల్యాణం, తిరువీధి జోడు సేవలు నిర్వహించారు. రాత్రి పవళింపు సేవ చేసి ఆలయాన్ని ద్వారబంధనంచేశారు. నిత్యకల్యాణం, సువర్ణ పుష్పార్చనలో భక్తులు పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు.

కొనసాగుతున్న శ్రీవల్లి టౌన్‌షిప్ వేలం

నల్లగొండ : రాజీవ్ స్వగృహ శ్రీవల్లి టౌన్‌షిప్‌లో ఓపెన్ ప్లాట్లు, పాక్షిక నిర్మాణ గృహాల 5వ విడత వేలం బుధవారం కలెక్టరేట్‌లో కొనసాగింది. ఈ వేలంలో రెండు ఓపెన్ ప్లాట్‌ల ద్వారా ప్రభుత్వానికి రూ.18.36 లక్షలు, ఐదు పాక్షిక నిర్మాణ గృహాల వేలం ద్వారా రూ.1.01కోట్లు వచ్చాయని తెలిపారు. ఈనెల 10వ తేదీ వరకు వేలం కొనసాగనుంది. కార్యక్రమంలో రాజీవ్ స్వగృహ ప్రాజెక్టు కోఆర్డినేటర్ సయ్యద్ షఫియోద్దీన్, గిరిజన సంక్షేమ శాఖ అధికారులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

బైక్ దొంగ అరెస్ట్

మునుగోడు: బైక్‌లను అపహరిస్తున్న దొంగను బుధవారం పోలీసులు అరెస్ట్ చేశారు. ఎస్.ఐ సీహెచ్ వెంకటేశ్వర్లు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. చండూరు మండలం బోడంగిపర్తికి చెందిన కట్కూరి నరేష్ మునుగోడులోని చండూరు రోడ్డులో టైయిర్ పంక్చర్ దుకాణం పెట్టుకొని జీవిస్తున్నాడు. అయితే అతను గత మంగళవారం కొరటికల్ గ్రామానికి చెందిన ఐతగోని రవి మునుగోడులోని సృజన ట్రేడర్స్ ఎరువుల దుకాణం ఎదుట పార్కింగ్ చేసిన ద్విచక్రవాహనాన్ని అపహరించాడు. దీంతో రవి స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరిపి నరేష్‌ని అదుపులోకి తీసుకొని విచారించి రిమాండ్‌కు తరలించారు.

పది మామిడి చెట్లు, బోరు మోటార్ దగ్ధం

పెన్‌పహాడ్ : గుర్తుతెలియని వ్యక్తులు వరికొయ్యలకు పెట్టిన నిప్పు పెట్టడంతో వ్యాపించిన మంటలు అంటుకుని పది మామిడి చెట్లు, బోరు మోటారు దగ్ధమైంది. ఈ ఘటన సూర్యాపేట జిల్లా పెన్‌పహాడ్ మండల కేంద్రంలో బుధవారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన గుండపనేని విద్యాసాగర్ రావుకు గ్రామ శివారులో మామిడి తోట పక్కన గల వరి కొయ్యలకు గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు పెట్టారు. ఆ మంటలు ప్రమాదవశాత్తు తోటలోకి వ్యాపించి మామిడి చెట్లు, పైపులు, బోరు మోటార్ దగ్ధమయ్యాయి. సుమారు లక్ష నష్టం వాటిల్లినట్లు బాధిత రైతులు తెలిపారు.

రేషన్ బియ్యం పట్టివేత

కోదాడరూరల్ : కోదాడ నుంచి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి తరలిస్తున్న క్వింటాన్నర రేషన్ బియ్యాన్ని బుధవారం రూరల్ పోలీసులు పట్టుకున్నారు. అనంతగిరి మండలానికి చెందిన సైదా గోల్‌తండా పరిసరా ప్రాంతాల్లో రేషన్ బియ్యాన్ని తక్కువ రేటుకు కొనుగోలు చేసి జగ్గయ్యపేటకు చెందిన పిచ్చయ్యకు విక్రయించేందుకు వెళ్తుండగా మండల పరిధిలోని చిమిర్యాల క్రాస్‌రోడ్ వద్ద పట్టుకొని ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

నలుగురిపై కేసు

కోదాడరూరల్ : ఏపీ నుంచి తెలంగాణలోకి అక్రమంగా రవాణా అవుతున్న రెండు ఇసుక లారీలను బుధవారం రూరల్ పోలీసులు పట్టుకున్నారు. ఏపీలోని నందిగామ సమీపంలో గల గనత్కుర్ ఇసుక రీచ్ నుంచి రెండు ఇసుక లారీలు అనుమతులు లేకుండా కోదాడకు వస్తుండగా రామాపురం క్రాస్‌రోడ్, కాపుగల్లు శివారులో పట్టుకుని వాటి యజమానులు, డ్రైవర్లపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

గాయపడిన మహిళ మృతి

త్రిపురారం : రోడ్డు ప్రమాదంలో గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న మహిళ మృతిచెందింది. ఏఎస్ఐ రామయ్య తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని బడా గయి గడ్డ గ్రామానికి చెందిన ధనావత్ బుజ్జి కుమారుడు రంగాతో కలిసి సోమవారం బైక్‌పై పనుల నిమిత్తం పర్వేదుల గ్రామానికి వెళ్తున్నారు. మండలంలోని అంజపపల్లి గ్రామ పరిధిలో ఉన్న గంగ దేవమ్మ గుడి వద్ద ఆకస్మికంగా బైక్ బ్రేక్ వేయడంతో వెనకాల కూర్చున్న ధనావత్ బుజ్జి రోడ్డుపై పడడంతో బలమైన గాయాలయ్యాయి. వెంటనే ఆమెను మిర్యాలగూడ ఏరియా ఆస్పత్రికి, అక్కడి నుంచి ఓ ప్రైవేటు ఆస్పత్రికి తీసుకెళ్లారు. పరిస్థితి విషమించడంతో హైదరాబాద్‌లోని నిమ్స్ ఆస్పత్రికి తీసుకెళ్లగా చికిత్స పొందుతూ మంగళవారం రాత్రి మృతి చెందింది. మృతురాలికి కొడుకు, ఇద్దరు కూతుర్లు ఉన్నారు. భర్త ధనావత్ సైదా ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోధు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ తెలిపారు.

‘సహకార’ం అవినీతిమయం

- కీతవారిగూడెం సహకార బ్యాంక్‌లో చోరీ కేసులో అనుమానాలెన్నో..
- స్ట్రాంగ్ రూం లాకర్లలో ఉండాల్సిన నోట్ల కట్టలు బీరువాపై..
- పోలీసుల తనిఖీల్లో రూ.11లక్షలు గుర్తింపు
- బ్యాంక్ అధికారుల నిర్లక్ష్యంపై విమర్శలు
- సీఈఓ, క్యాషియర్ పాత్రపై పోలీసుల ఆరా


గరిడేపల్లి మండలం కీతవారిగూడెంలోని రాయినిగూడెం పీఏసీఎస్ భవనం

గరిడేపల్లి : సూర్యాపేట జిల్లా గరిడేపల్లి మండలం కీతవారిగూడెం గ్రామ పరిధి రాయినిగూడెం సహకార సంఘం అవినీతిలో కూరుకుపోయిందని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఇదే బ్యాంక్‌లోకి దుండగులు చొరబడి రూ.8లక్షలు చోరీ చేసిన విషయం సోమవారం వెలుగులోకి వచ్చిన విషయం తెలిసిందే. కేసు విచారణలో భాగంగా పోలీసులు బ్యాంక్‌లోకి వెళ్లి విచారణ చేపట్టగా స్ట్రాంగ్ రూము లాకర్లలో ఉండాల్సిన రూ.11లక్షలు బీరువాపై కాగితాల మధ్యలో ఉండడం విస్మయపరుస్తోంది. ఇందులో అడుగడుగునా బ్యాంక్ అధికారుల నిర్లక్ష్యం ఉందని విమర్శలు వినిపిస్తున్నాయి.

ఆ దబ్బు ఎక్కడిది?

చోరీ ఘటనలో బ్యాంక్ అధికారుల పాత్రపై పోలీసులు లోతుగా ఆరా తీస్తున్నారు. గత శుక్రవారం వరకు రైతుల నుంచి అప్పుల రూపంలో డబ్బులు వసూలు చేసిన అధికారులు వారి ఖాతాల్లో జమ చేసి సమీప సహకార బ్యాంక్‌లో భద్రపర్చాల్సి ఉంటుంది. అయితే, బ్యాంక్‌కు వరుసగా రెండు రోజుల పాటు సెలవులు ఉండగా అధికారులు డబ్బు భద్రపరచకపోవడంపై అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. అసలు ఒక్క శుక్రవారమే బ్యాంక్ అధికారులు రైతుల నుంచి రూ.19లక్షలు (చోరీకి గురైన రూ.8లక్షలతో కలిపి) వసూలు చేశారా? ఆ డబ్బును అధికారులు ఎందుకు నిర్లక్ష్యంగా బీరువాపై, కౌంటర్లలో ఉంచారనేది అంతుచిక్కని ప్రశ్నలు. అసలు కార్యాలయ సిబ్బంది రైతుల నుంచి వసూలు చేసిన సొమ్ము ఎంత..? ఈ డబ్బు లెక్కల్లోకి చేరనివా అనే అనుమానాలు లేకపోలేదు. దీనిపై గడిచిన రెండు రోజులుగా పోలీసులు బ్యాంక్ అధికారులను విచారిస్తున్నట్లు తెలిసింది. పోలీసులు పూర్తి స్థాయిలో దర్యాప్తు చేసిన తర్వాత అసలు విషయాలు బయటపడే అవకాశం ఉంది.

బంగారం సురక్షితం

కీతవారిగూడెం గ్రామ పరిధిలోని రాయనిగూడెం పీఏసీఎస్‌లో బంగారం సురక్షితంగానే ఉందని జిల్లా బ్యాంకు మేనేజర్ రవికుమార్ తెలిపారు. బుధవారం పీఏసీఎస్ బ్యాంకులో అప్రైజర్ మదనాచారితో బంగారం నిల్వలను, ఖాతాదారుల వివరాలను తనిఖీ చేశారు. బ్యాంకు పరిధిలో 33 బంగారం లోన్ల ఖాతాలు ఉన్నాయని, ఖాతాదారులు తాకట్టుపెట్టిన గోల్డ్ లోను తీసుకున్న బంగారంలో ఎలాంటి తేడాలు లేవని తెలిపారు. ఆయన వెంట సూపర్‌వైజర్ రవీందర్‌రెడ్డి తదితరులున్నారు.

అక్రమాలపై సమగ్ర విచారణ జరిపించాలి

గరిడేపల్లి మండలం రాయినిగూడెం పీఏసీఎస్‌లో జరిగిన చోరీపై సమగ్ర విచారణ జరిపించాలని కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్‌కె చాంద్‌పాష డిమాండ్ చేశారు. పాలక మండలి, ఉద్యోగ సిబ్బందిని తక్షణమే తొలగించాలన్నారు. బుధవారం స్థానిక పార్టీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. రాయనిగూడెం పీఏసీఎస్‌లో భారీ కుంభకోణం జరిగిందని ఆరోపించారు. రైతులకు వచ్చే సబ్సిడీ పేరు మీద మందు కట్టల పేరుమీద, వడ్డీ మాఫీ మీద వచ్చిన డబ్బులను కాజేశారని ఆరోపించారు. సమావేశంలో కాంగ్రెస్ నాయకులు కీత సోమయ్య, వెంకటేశ్వర్లు, లక్ష్మీనారాయణ, మట్టయ్య, కృష్ణమూర్తి, రాంమ్మూర్తి, నర్సయ్య, శ్రీను, నాగులు మీరా, నాగయ్య, సైదయ్య తదితరులున్నారు.

వృత్తిదారులకు రూ.లక్ష ఆర్థికసాయం

- నేటినుంచి దరఖాస్తుల స్వీకరణ

భువనగిరిటౌన్ : బీసీ వర్గాల్లోని కుల, చేతివృత్తిదారులకు ప్రభుత్వం తీపికబురు అందించింది. పనిముట్లు, ముడి సరుకులు కొనుగోలు చేసుకునేందుకు రూ.లక్ష ఆర్థిక సాయం అందజేయాలని నిర్ణయించింది. ఇందుకు సంబంధించిన విధివిధానాలను విడుదల చేసింది. మంగళవారంనుంచి ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు స్వీకరించనుంది.

మార్గదర్శకాలు ఇవీ..

- బీసీ కులవృత్తిదారులు, చేతివృత్తిదారులు అర్హులు. పనిముట్ల కొనుగోలు, ఆధునీకరణ లేదా ముడిసరుకు కొనుగోలుకు మాత్రమే ఆర్థికసాయం అందిస్తారు.
- అభ్యర్థుల వయస్సు జూన్ 2నాటికి 18–55 ఏండ్లు ఉండాలి.
- వార్షిక ఆదాయం గ్రామీణ ప్రాంతాల్లో 1.50 లక్షలు, పట్టణ ప్రాంతాల్లో రూ.2 లక్షలకు మించకూడదు.
- ఆ కుటుంబంలో ఒక్కరికి మాత్రమే వృత్తుల అభ్యున్నతికి ఆర్థిక సాయం అందిస్తారు.
- దరఖాస్తు తేదీ నుంచి గత 5 ఏండ్లలో ఏ ప్రభుత్వ శాఖ ద్వారా కూడా లబ్ధిపొందిన వారు. 2017– 18లో రూ. 50 వేల ఆర్థిక సాయం పొందిన వారు అనర్హులు.

ఎంపిక ప్రక్రియ ఇది..

- 20 తేదీ వరకు http://tsobmmrbc.cgg.gov.in వెబ్‌సైట్లో అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలి.
- రేషన్‌కార్డు, కుల, ఆదాయం ధ్రువీకరణ పత్రాలు, ఆధార్‌కార్డు, బ్యాంక్ పాస్‌బుక్, పాస్ పోర్ట్ సైజ్ ఫొటోను దరఖాస్తుతో సమర్పించాలి.
- 20 నుంచి జూన్ 26వ తేదీ వరకు మండలస్థాయిలో ఎంపీడీఓలు, మున్సిపాలిటీల్లో మున్సిపల్ కమిషనర్లు క్షేత్రస్థాయిలో పర్యటించి దరఖాస్తుదారుల వివరాలను పరిశీలిస్తారు.
- జిల్లా కలెక్టర్ అధ్యక్షతన ఏర్పాటైన కమిటీకి నివేదిస్తారు.
- ఆ కమిటీ అర్హులను గుర్తించి జాబితాను సిద్ధం. చేసి జూన్ 27వ తేదీలోగా జిల్లా ఇన్‌చార్జి మంత్రి ఆమోదం తీసుకోవాల్సి ఉంటుంది.
- రూ.లక్ష ఆర్థిక సాయం కోసం ఎంపికైన లబ్ధిదారుల జాబితాను ఆన్‌లైన్లో ప్రకటిస్తారు.
- ఆ తర్వాత లబ్ధిదారుడి బ్యాంకు ఖాతాకు నేరుగా రూ.లక్ష ఆర్థికసాయాన్ని ప్రభుత్వం మంజూరు చేస్తుంది.
- ఆర్థికసాయం పొందిన నెలలోగా ఆ నిధులతో పనిముట్లు, ముడిసరుకును లబ్ధిదారులు కొనుగోలు చేయాల్సి ఉంటుంది. ఎంపీడీవోలు క్షేత్రస్థాయిలో యూనిట్ల గ్రౌండింగ్‌ను పర్యవేక్షిస్తారు.

నేటి నుంచి మృగశిర కార్తె ప్రారంభం


నల్లగొండలోని ప్రకాశం బజార్‌లో చేపలు కొనుగోలు చేస్తున్న ప్రజలు

రామగిరి(నల్లగొండ): మృగశిర కార్తె గురువారం నుంచి ప్రారంభం కానుంది. కృతిక, రోహిణి కార్తెల్లో ఎండలకు అల్లాడిపోయిన ప్రజలు మృగశిర కార్తె ప్రవేశంతో కాస్తంతా ఉపశమనం కలుగనుంది. వానాకాలం ఆరంభానికి సూచనగా భావించే ఈ కార్తెలోనే రుతుపవనాలు ప్రవేశిస్తాయి. 15 రోజుల పాటు మృగశిర కార్తె ఉంటుంది. మాంసం ప్రియులు తొలిరోజు చేపలు తినేందుకు ఆసక్తి చూపుతుంటారు.ఈ రోజు చేపలు తింటే వ్యాధులు దూరమవుతాయనేది ప్రజల బలమైన నమ్మకం. ముఖ్యంగా గుండె జబ్బులు, అస్తమా రోగులకు ఉపశమనం కలుగుతుందని చెబుతుంటారు. అందుకనే నల్లగొండ పట్టణంలో పానగల్లు, ప్రకాశం బజార్, బీటీఎస్, దేవరకొండ రోడ్డులోని చేపల మార్కెట్లు చేపలు ప్రజలతో రద్దీగా దర్శనమిచ్చాయి.


కొనుగోలు చేసిన చేపను చూపుతున్న వృద్ధుడు



భారీ చేపలను కొనుగోలు చేసి తీసుకెళ్తున్న యువకుడు, పానగల్ రోడ్డులో చేపల విక్రయం

చనిపోతూ ముగ్గురికి ప్రాణదానం !

- రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి బ్రెయిన్ డెడ్
- అవయవాలు దానం చేసిన కుటుంబ సభ్యులు


నాగేశ్వరరావు (ఫైల్)

మునగాల(కోదాడ): రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి చనిపోతూ ముగ్గురికి ప్రాణదానం చేశాడు. మృతుడి కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మునగాల మండలం కలకోవ గ్రామానికి చెందిన బెల్లంకొండ నాగేశ్వరరావు (42) స్వగ్రామం నుంచి బైక్‌పై ఇటీవల సూర్యాపేట వైపు వెళ్తుండగా మార్గమధ్యలో దురాజ్‌పల్లి వద్ద గుర్తుతెలియని వాహనం ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన నాగేశ్వరరావును కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం హైదరాబాద్‌లోని యశోద ఆస్పత్రికి తరలించారు. అయితే, నాగేశ్వరావు బ్రెయిన్‌డెడ్ కావడంతో కోమాలోకి వెళ్లాడు. వైద్యులు బతకడం కష్టమని తేల్చిచెప్పడంతో కుటుంబ సభ్యులు అవయవ దానానికి ఒప్పుకున్నారు. కాగా, చికిత్స పొందుతున్న నాగేశ్వరరావు బుధవారం మృతిచెందడంతో ముందుగా నిర్ణయించిన ప్రకారం అతడి కిడ్నీలు, గుండె, లివర్‌ను ఆస్పత్రి సిబ్బందికి అందజేయగా ముగ్గురికి అమర్చారు.చనిపోతూ మరో ముగ్గురికి ప్రాణదానం చేయడంతో ఆస్పత్రి యజమాన్యం అభినందించింది. మృతుడికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. నాగేశ్వరరావు మృతదేహానికి స్వగ్రామంలో అంత్యక్రియలు నిర్వహించారు.

పోలీసులకు గోవుల వాహనం అప్పగింత

నకిరేకల్ : అనకాపల్లి నుంచి హైదరాబాద్ పాతబస్తీకి తరలిస్తున్న గోవుల వాహనాన్ని పట్టుకుని నకిరేకల్ పోలీస్‌స్టేషన్‌లో అప్పగించినట్లు బీజేపీ పట్టణ అధ్యక్షుడు పల్స శ్రీనుగౌడ్ తెలిపారు. అనంతరం గోవులను తరలిస్తున్న వారిపై కేసులు నమోదు చేయాలని, గోవులను నల్లగొండలోని సమర్థ నారాయణ గోశాలకు తరలించాలని పోలీసులను కోరినట్లు తెలిపారు. ఆయన వెంట బీజేపీ నాయకులు సూరపల్లి గోపాల్, సిరిశాల నర్సింహ తిరందాస్ ప్రకాశ్, చిట్టిప్రోలు శివలింగం ఉన్నారు.

గుర్తుతెలియని వాహనాన్ని ఢీకొని వ్యక్తి మృతి


లింగయ్య(ఫైల్)

కనగల్: రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతిచెందాడు. ఈ ఘటన కనగల్ మండల పరిధిలో చోటు చేసుకుంది. మండల పరిధిలోని పొను గోడు గ్రామానికి చెందిన చాడ లింగయ్య(55) చండూరు పట్టణంలోని బస్టాండ్ ముందు టీస్టాల్ నడుపుతూ జీవనం సాగిస్తున్నాడు. రోజు మాదిరిగానే షాపు ముగించుకుని మంగళవారం రాత్రి తన ద్విచక్ర వాహనంపై పొనుగోడుకు బయలుదేరాడు. మార్గ మధ్యలో మండల పరిధిలోని కురంపల్లి పార్ బాయిల్డ్ రైస్‌మిల్లు వద్ద గుర్తుతెలియని వాహనాన్ని ఢీకొట్టాడు. ప్రమాదంలో లింగయ్యకు తీవ్రగాయాలు కావడంతో నల్లగొండ పట్టణంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు తెలుపడంతో హైదరాబాద్‌కు తీసుకెళ్లి చికిత్స అందిస్తుండగా బుధవారం రాత్రి మృతిచెందాడు. లింగయ్య బీఆర్ఎస్ మాజీ గ్రామ శాఖ అధ్యక్షుడిగా పనిచేసాడు. ఆయన మృతికి పలువురు బీఆర్ఎస్ నాయకులు సంతాపం తెలిపారు. లింగయ్యకు ముగ్గురు కుమారులు ఉన్నారు. ఈ ఘటనపై ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.

డంపింగ్‌యార్డులో మంటలు


డంపింగ్‌యార్డులో ఎగిసిపడుతున్న మంటలు

నల్లగొండ టూటౌన్ : నల్లగొండ మున్సిపాలిటీ పరిధిలోని శేషమ్మగూడెం సమీపంలోని డంపింగ్ యార్డులో మంగళవారం రాత్రి సమయంలో మంటలు చెలరేగాయి. పొగతో మొదలై మంటలు చెలరేగడంతో మున్సిపల్ కమిషనర్ కె.వీ.రమణాచారి అధికారులతో మాట్లాడి రెండు ఫైరింజన్లు తెప్పించారు. అర్ధరాత్రి రెండు గంటల వరకు ఫైరింజన్ల ద్వారా మంటలు చల్లార్చి అదుపులోకి తెచ్చారు. మున్సిపల్ కమిషనర్‌తో పాటు డీఈలు, సానిటరీ ఇన్‌స్పెక్టర్లు ఉదయం 7గంటల వరకు అక్కడే ఉండి పరిస్థితిని పర్యవేక్షించారు. వేసవి కావడంతో డంపింగ్ యార్డులో చెత్తకు నిప్పు అంటుకుందా లేక ఎవరైనా సిగరెట్లు తాగి వేయడం వలన మంటలు అంటుకున్నాయా అనే కోణంలో మున్సిపల్ అధికారులు ఆరా తీస్తున్నారు.

తప్పిన భారీ ఆస్తి నష్టం

మున్సిపాలిటీకి చెందిన డంపింగ్ యార్డులో చెలరేగిన మంటలు అదుపులోకి రాకపోతే మున్సిపల్ ఆస్తులతో పాటు దానికి సమీపంలో ఉన్న ప్రైవేట్ ఆస్తులకు సైతం భారీగా నష్టం జరిగి ఉండేది. మంటలు చెలరేగడాన్ని వెంటనే సకాలంలో గుర్తించిన మున్సిపల్ సిబ్బంది వెంటనే కమిషనర్ రమణాచారి దృష్టికి తీసుకుపోయారు. దాంతో ఫైర్ అధికారులతో మాట్లాడి ఫైరింజనును త్వరగా డంపింగ్ యార్డుకు చేరుకునేలా చేశారు. అప్పటికే డంపింగ్ యార్డులో చెత్తనంతా మంటలు అంటుకొని పొగ కమ్ముకుంది. ఫైర్ సిబ్బంది మంటలను ఆర్పడంతో భారీ ఆస్తినష్టం తప్పింది.

వివాహం కావడం లేదని..

- పురుగుల మందు తాగిన యువకుడు మృతి

హుజూర్‌నగర్: వివాహం కావడం లేదని జీవితంపై విరక్తి చెంది పురుగుల మందు తాగిన యువకుడు మృతిచెందాడు. ఎస్ఐ వెంకట్‌రెడ్డి తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. చిలుకూరు మండలం చెన్నారిగూడేనికి చెందిన బండి సుధాకర్ (33) హుజూర్ నగర్‌లోని ఒక గదిలో అద్దెకు ఉంటూ స్థానిక తెలంగాణ ఆస్పత్రిలోని మెడికల్ షాప్‌లో గుమాస్తాగా పనిచేస్తున్నాడు. అయితే అతని తమ్ముడికి వివాహం అయినా కూడా తనకు వివాహం కావడం లేదని జీవితంపై విరక్తి చెందాడు. గత నెల 31న తన గదిలోనే పురుగుల మందు తాగాడు. గమనించిన స్థానికులు అతడిని ఆస్పత్రికి తీసుకెళ్లి ప్రాథమిక చికిత్స చేయించి కుటుంబ సభ్యులకు తెలియజేశారు. వెంటనే వారు వచ్చి మెరుగైన వైద్యం కోసం ఖమ్మంలోని ప్రైవేటు హాస్పటల్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం రాత్రి మృతిచెందాడు. సుధాకర్ తమ్ముడు బండి వీరబాబు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

జాతీయ రహదారిపై ఘోర రోడ్డు ప్రమాదం

- కారు అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొని ఎగిరి ఎదురుగా వచ్చే రెండు లారీలను ఢీకొట్టిన వైనం
- అక్కడికక్కడే ఇద్దరు, చికిత్స పొందుతూ మరొకరు మృతి..ఇంకొకరికి గాయాలు
- చిట్యాల మండలం పెద్దకాపర్తి శివారులో దుర్ఘటన


ధ్వంసమైన కారు, ఇరుక్కుపోయిన మృతదేహాలు

చిట్యాల: నల్లగొండ జిల్లా చిట్యాల మండలం పెద్ద కాపర్తి గ్రామ శివారు జాతీయ రహదారిపై బుధవారం అర్ధరాత్రి జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో ముగ్గురు మృతిచెందగా మరొకరికి గాయాలయ్యాయి. వివరాలు ఇలా ఉన్నాయి. విజయవాడ వైపు నుంచి హైదరాబాద్ వైపు వేగంగా వెళ్తున్న స్కోడా కారు చిట్యాల మండలం పెద్దకాపర్తి గ్రామ శివారు అండర్ పాస్ సమీపంలోని మసీదు వద్దకు రాగానే అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొట్టింది.ఆపై పైకి ఎగిరి హైదరాబాద్ నుంచి విజయవాడ వైపునకు వెళ్తున్న రెండు లారీలను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో కారు నుజ్జునుజ్జయ్యింది. అందులో ప్రయాణిస్తున్న నలుగురిలో ఇద్దరు అక్కడికక్కడే మృతిచెందారు. మరో ఇద్దరికి సైతం తీవ్ర గాయాలయ్యాయి. మృతదేహాలను నల్లగొండ ప్రభుత్వ ఆస్పత్రికి, గాయపడిన వారిని కామినేని ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మరొకరు మృతిచెందారు. గాయపడిన మరొకరి పరిస్థితి కూడా విషమంగా ఉన్నట్లు తెలుస్తోంది. కాగా, మృతుల, క్షతగాత్రుడి వివరాలు తెలియరాలేదు.

తాటిచెట్టు పైనుంచి పడి గీతకార్మికుడు మృతి


ఘటనాస్థలంలో యాదగిరి మృతదేహం

అడ్డగూడూరు : తాటిచెట్టు పైనుంచి కిందపడి ఓ గీత కార్మికుడు మృతిచెందాడు. ఈఘటన అడ్డగూడూరు మండల కేంద్రంలో బుధవారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మండల కేంద్రానికి చెందిన పులిపలుపుల యాదగిరి (53) రోజూ మాదిరిగా కల్లు తీయడానికి తాటి చెట్టు ఎక్కాడు. ఈ క్రమంలో ప్రమాదవశాత్తు కాలుజారి కిందపడడంతో తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతిచెందాడు. మధ్యాహ్నం వరకు ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు తాటివనాల్లో వెతకగా యాదగిరి అప్పటికే మృతిచెంది ఉన్నాడు. సమాచారం మేరకు పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ఆస్పత్రికి తరలించారు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ఉదయ్‌కుమార్ తెలిపారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు.

షార్ట్‌సర్క్యూట్‌తో పత్తి లారీ దగ్ధం


దగ్ధమైన పత్తి లారీ

మునుగోడు: షార్ట్ సర్క్యూట్‌తో పత్తి లారీ దగ్ధమైంది. ఈ ఘటన బుధవారం మునుగోడులో చోటుచేసుకుంది. బాధిత వ్యాపారి, స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మునుగోడు మండలం చొల్లేడు గ్రామానికి చెందిన పత్తి వ్యాపారి శేఖర్ రైతుల వద్ద కొనుగోలు చేసిన పత్తిని లారీలో వరంగల్‌కు తరలిస్తున్నాడు. మార్గమలధ్యలో మునుగోడు గ్రామ శివారులోని కార్మిక నగర్ వద్ద విద్యుత్ వైర్లు ఆనుకొని మంటలు లేచి పత్తికి నిప్పు అంటుకున్నాయి. దీంతో అందులో ఉన్న దాదాపు 15 క్వింటాళ్ల పత్తి పూర్తిగా దగ్ధమైయింది. అంతే కాకుండా లారీ సగానికి పైగా దగ్ధమైయింది. ఈ ప్రమాదంలో ఎలాంటి ప్రాణ నష్టం జరగలేదు. ఈ ఘటనపై ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.

అప్పుల బాధతో రైతు ఆత్మహత్య


నర్సిరెడ్డి (ఫైల్)

కట్టంగూర్ : అప్పుల బాధతో ఓ రైతు ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన కట్టంగూర్ గ్రామ పంచాయతీ పరిధి మీర సాహెబ్‌గూడెంలో బుధవారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన పర్నె నర్సిరెడ్డి(48) తనకున్న 5 ఎకరాలతో పాటు మరో 10 ఎకరాలు కౌలుకు తీసుకొని పత్తి, వరిపంట సాగు చేశాడు. పంట దిగుబడి రాకపోవటంతో అప్పులు పాలయ్యాడు. అప్పులు పెరగటంతో మనస్తాపం చెంది మంగళవారం అర్ధరాత్రి పురుగుల మందు తాగాడు. గమించిన కుటుంబ సభ్యులు అతడిని నార్కట్‌పల్లి కామినేని ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ బుధవారం తెల్లవారుజామున మృతిచెందాడు. సుమారు రూ.10 లక్షలు అప్పు అయినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. మృతుడికి ఇద్దరు కుమారులున్నారు. మృతుడి భార్య పరమేశ్వరి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతన్నట్లు ఎస్ రాజు తెలిపారు.

ఉరేసుకుని సాఫ్ట్‌వేర్ ఇంజనీర్..


మహేష్(ఫైల్)

సంస్థాన్ నారాయణపురం: ఆర్థిక ఇబ్బందులు తట్టుకోలేక ఓ సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ బలవన్మరణానికి పాల్పడ్డాడు. సంస్థాన్‌నారాయణపురం మండలం మల్లారెడ్డిగూడెంలో బుధవారం వెలుగులోకి వచ్చిన ఈ ఘటనపై పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మల్లారెడ్డిగూడెం గ్రామానికి చెందిన నర్రి సత్తయ్య–శోభల కుంటుంబం హైదారాబాద్‌లోని ఎల్‌బీ నగర్ ప్రాంతంలో నివాసం ఉంటున్నారు. సత్తయ్య వ్యాపారం చేస్తుండగా, ఆయన కుమారుడు మహేష్(27) సాఫ్ట్‌వేర్ ఇంజనీరుగా పనిచేస్తున్నాడు. మహేష్‌కు 5నెలల క్రితం మసీద్‌గూడెం గ్రామానికి చెందిన అఖిలతో వివాహం జరిగింది. కాగా, మహేష్ సోమవారం హైదరాబాద్ నుంచి తన స్వగ్రామామైన మల్లారెడ్డిగూడేనికి వెళ్తున్నాని కుంటుంబ సభ్యులుకు చెప్పి గ్రామానికి చేరుకున్నాడు. ఇంట్లోకి వెళ్లి గేట్‌కు బయట నుంచి తాళం వేసుకున్నాడు. దాంతో గేటుకు తాళం ఉండటంతో గ్రామాస్తులు ఎవరూ గమనించలేదు. ఇంట్లో ఫ్యాన్‌కు చీరతో ఉరివేసుకున్నాడు. కుంటుంబ సభ్యులు ఫోన్ చేయగా స్పందించడం లేదు. మృతుడి తల్లి శోభ ఇంటిని అద్దెకు ఇవ్వాడానికి వచ్చి చూడగా, కుమారుడు విగత జీవిగా పడి ఉన్నాడు. దుర్వాసన వస్తుండటంతో రెండు రోజుల క్రితం మృతిచెందినట్లుగా అనుమానిస్తున్నారు. బెట్టింగ్‌లు ఆడటంతో ఆర్థిక ఇబ్బందులు ఎదురైనట్లు తెలిసింది. సమాచారం మేరకు పోలీసులు ఘటనాస్థలాన్ని పరిశీలించారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని చౌటుప్పల్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కుంటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు ఎస్ఐ రాఘవేంద్ర కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

పురుగుల మందు తాగి..


ఘటనాస్థలంలో వెంకటేశ్వర్లు మృతదేహం

పాలకవీడు: కుటుంబ కలహాలతో ఓ వ్యక్తి పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన పాలకవీడు మండలంలోని యల్లాపురం గ్రామంలో బుధవారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన పాలగాని సైదులు(40) విద్యుత్‌శాఖలో ఆర్టిజన్‌గా విధులు నిర్వహించడంతో పాటు వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. మృతుడికి భార్య ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఇటీవల సైదులు అత్త మృతిచెందడంతో రైతుబీమా డబ్బులు, ఇల్లు అమ్మకం విషయంలో వివాదం నెలకొంది. దీంతో మనస్తాపం చెందిన సైదులు మంగళవారం రాత్రి యల్లాపురం గ్రామానికి చేరుకుని తన వ్యవసాయ భూమిలో మద్యంలో పురుగుల మందు కలుపుకుని తాగాడు. ఉదయాన్నే అటుగా వెళ్లిన రైతులు గమనించడంతో అప్పటికే మృతిచెందాడు. వారిచ్చిన సమాచారం మేరకు పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ఆస్పత్రికి తరలించారు. మృతుడి సోదరుడు రవి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ లింగయ్య తెలిపారు.